సాక్షి తిరుపతి

శుక్రవారం । 19 । మే । 2023



టాపర్లకు జగనన్న బొనాంజ

పది, ఇంటర్‌లో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సత్కరించనున్నట్టు కలెక్టర్ తెలిపారు. -IIలో



మిస్టరీ వీడేదెప్పుడు?

చంద్రగిరి మండలం, కొత్తశానంబట్లలో మంటల మిస్టరీ ఇంకా కొనసాగుతూనే ఉంది. -IIలో

	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	41	27
తిరుపతి	42	28
తిరుమల	36	23
గూడూరు	43	29
నగరి	42	28

న్యూస్‌రీల్

రో'జూ' పరిశుభ్రంగా ఉంచుదాం



సందర్శకులకు అవగాహన కల్పిస్తున్న జూ అధికారులు

తిరుపతి మంగళం : తిరుపతి శ్రీవేంకటేశ్వర జంతు ప్రదర్శనశాల (ఎస్వీ జూపార్క్)ను పరిశుభ్రంగా ఉంచుకుందామని జూ క్యూరేటర్ పీ.శెల్వం సూచించారు. గురువారం ఎస్వీ జూలో గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మిషన్ లైఫ్, లైఫ్‌స్టైల్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో ఒడిస్సా, మహారాష్ట్ర, కేరళ, తెలంగాణ, తమిళనాడు వంటి పలు రాష్ట్రాల నుంచి 500 మంది ఎన్‌సీసీ సభ్యులు జూను సందర్శించారు. వీరికి జూ క్యూరేటర్ శెల్వం, అసిస్టెంట్ క్యూరేటర్ మాదవరావు ప్లాస్టిక్ నిషేధం, సైకిల్ క్యాంపెయిన్, గాజు బాటిల్‌ను వాడడం, వెదురు చెత్త బుట్టలను ఏర్పాటు చేయడం, క్లాత్ బ్యాగులను వాడడం వంటి అంశాలపై వారికి అవగాహన కల్పించారు. మానవమనుగడకు పర్యావరణం పచ్చగా ఉంచడం, వన్యప్రాణులను సంరక్షించడంతోనే సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జూ బయోలజిస్టులు దీపక్, శ్రయ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం



శరవణన్ (ఫైల్)

తిరుపతి కల్చరల్: తిరుచానూరు అమ్మవారి దర్శనార్థం విచ్చేసి నేపథ్యంలో మానసిక పరిస్థితి సరిలేని తమ తమ్ముడు శరవణన్ (33) తప్పిపోయాడని, అతని ఆచూకీ తెలిస్తే తమకు సమాచారం ఇచ్చి ఆదుకోవాలని బాధితుడి అన్న ఎస్.శంకరన్ ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. తమిళనాడుకు చెందిన తమ కుటుంబం ఈనెల 13వ తేదీన తిరుచానూరు అమ్మవారి దర్శనం చేసుకున్న తర్వాత తిరుచానూరు బస్టాండ్ వద్ద కనపడకుండా తప్పిపోయాడని పేర్కొన్నారు. ఈమేరకు తిరుచానూరు పోలీస్‌లకు ఫిర్యాదు చేశామని తెలిపారు. తప్పిపోయిన తన తమ్ముడు 5.6 అడుగుల ఎత్తు, చామనఛాయ కలిగి రెడ్ కలర్ చెక్స్ షర్ట్ వేసుకొని ఉన్నాడని, తమిళం మాట్లాడుతాడని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 579, ఇందిరానగర్, వాలియంబట్టి, వాణియంబాడి, తిరుపత్తూర్ జిల్లా, తమిళనాడు చిరునామాకు, లేదా 9655632554, 8883674155కు సామాచారం అందించాలని కోరారు. ఆచూకీ తెలిపిన వారికి తగిన పారితోషికం ఇస్తామని తెలిపారు.

బాలాంజనేయ స్వామివారికి పట్టువస్త్రాల సమర్పణ

తిరుమల: హనుమజ్జయంతి ఉత్సవాల్లో చివరి రోజైన గురువారం ఉదయం తిరుమల ఆకాశగంగలోని శ్రీ అంజనాదేవి, శ్రీ బాలాంజనేయస్వామివారికి టీటీడీ ఈవో ఏవీ.ధర్మారెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా అంజనాదేవికి, బాలాంజనేయ స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. అదేవిధంగా, శ్రీసుదర్శన చక్రత్తాళ్వార్‌కు ఆకాశగంగ తీర్థంలో చక్రస్నానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ వైఖానస ఆగమ సలహాదారు మోహనరంగాచార్యులు, శ్రీవారి ఆలయ పేష్కార్ శ్రీహరి, పారుపత్తేదార్ తులసీప్రసాద్ పాల్గొన్నారు.

వెకేషన్ కోర్టు 2వ షెడ్యూల్ విడుదల

తిరుపతి లీగల్ : కోర్టులకు వేసవి సెలవులు ప్రారంభం కావడంతో అత్యవసర కేసులను దాఖలుచేసి ఉత్తర్వులు పొందడానికి జిల్లా కోర్టు చిత్తూరు, తిరుపతి, మదనపల్లి, పీలేరులో వెకేషన్ కోర్టు బెంచ్‌లను ఏర్పాటు చేసింది. ఇదివరలో మొదటి షెడ్యూల్‌ను చిత్తూరు మొదటి అదనపు జిల్లా జడ్జి విడుదల చేసిన విషయం తెల్సిందే. ఈనెల 31 నుంచి జూన్ 12వ తేదీ వరకు వెకేషన్ కోర్టు జడ్జిగా తిరుపతి 5వ అదనపు జిల్లా జడ్జి జి.అన్వర్ బాషా వ్యవహరించనున్నారు. ఈనెల 31 నుంచి ఏయే ప్రాంతాల్లో వెకేషన్ కోర్టు బెంచ్‌ను నిర్వహించేది ఆయన షెడ్యూల్ విడుదల చేశారు. ఈనెల 31, జూన్ 7 తేదీలలో చిత్తూరులోనూ, ఈనెల 30, జూన్ 01, 06, 08 తేదీలలో తిరుపతిలో, జూన్ 02, 09 తేదీలలో మదనపల్లిలో, జూన్ 05వ తేదీన పీలేరులో వెకేషన్ కోర్టు బెంచ్‌లను నిర్వహించనున్నట్లు న్యాయమూర్తి షెడ్యూల్‌లో పేర్కొన్నారు.

నేడు వలంటీర్లకు వందనం

తిరుపతి అర్బన్: వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఉత్తమ సేవలందించిన 11,001 మంది వలంటీర్లకు శుక్రవారం ఎస్వీయూనివర్సిటీ శ్రీనివాస ఆడిటోరియంలో సన్మాన కార్యక్రమం ఉంటుందని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. జిల్లాలో సేవా మిత్ర 10,751 మంది, సేవ రత్న 215, సేవా వజ్రకు 35 మంది ఎంపికయ్యారని ఆయన పేర్కొన్నారు. సంబంధిత వలంటీర్లను సన్మానించనున్నట్టు తెలిపారు.

లంచావతారం

- శ్రీరంగరాజపురం మండలం, శెట్టివానత్తానికి చెందిన రైతు సుబ్బారెడ్డి మృతి చెందారు. ఆయన పేరున ఉన్న ఎకరా 35 సెంట్ల భూమిని తన సోదరుడు మీద మార్చాలని సుబ్బారెడ్డి పెద్ద కుమారుడు నిర్ణయించాడు. సోదరుడి పేరు మీద పట్టాదారు పాసు పుస్తకం కోసం మ్యూటేషన్ దరఖాస్తు చేసుకున్నాడు. ఈ క్రమంలోనే తహసీల్దార్, వీఆర్వోలు కలిసి రూ.60 వేలు డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. గత మార్చి 21న రూ.20వేలు లంచం తీసుకుంటూ శ్రీరంగరాజపురం తహసీల్దార్ షబ్బీర్ ఏసీబీకి చిక్కాడు.
- ఈ నెల 17న కుప్పం మండలంలో రూ.45 వేలు లంచం తీసుకుంటూ వీఆర్వో వెంకటేశ్ ఏసీబీకి దొరికాడు. 15 పాసుపుస్తకాలకు గాను రూ.1.5 లక్షలు డిమాండ్ చేసి దొరికిపోయాడు. న్యాయం చేయాలని రైతు కన్నప్పన్ పలు మార్లు బతిమాలినా వీఆర్వో కరుణించలేదు. లంచం ఇస్తే గానీ పాసుపుస్తకాలు మంజూరు చేయనని భీష్మించుకోవడంతో బాధితుడు కన్నప్పన్ ఏసీబీకి ఫిర్యాదు చేశాడు. కన్నప్పన్ నుంచి వీఆర్వో వెంకటేశ్ నేరుగా నగదు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

..ఇవి మచ్చుకు రెండు మాత్రమే.. ఇలాంటివి నెలకు ఒకటో రెండో జరుగుతూనే ఉన్నాయి. లంచాలకు అలవాటుపడ్డ అధికారులు చెలరేగిపోతున్నారు. ప్రభుత్వం నుంచి జీతాలు తీసుకుంటూనే ముడుపుల బాగోతానికి తెరలేపుతున్నారు. అధికారులు ఎడాపెడా దాడులు చేస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరికలు జారీచేస్తున్నా పైసా వసూలు చేయకుండా ఆగలేకపోతున్నారు. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడమే వీరి అవినీతి అక్రమాలకు ప్రధాన కారణమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.





శ్రీరంగరాజపురం తహసీల్దార్ కార్యాలయం

లంచాలకు కేరాఫ్ అడ్రస్‌గా తహసీల్దార్ కార్యాలయాలు

- అవినీతికి రోల్‌మోడల్‌గా పలువురు వీఆర్వోలు
- ముడుపులివ్వందే ఏపనీ కాదు
- ఉన్నతాధికారులు పట్టించుకుంటేనే!

సాక్షి, తిరుపతి/చిత్తూరు కలెక్టరేట్: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు పారదర్శకమైన పరిపాలన అందిస్తోంది. తమ సొంత గ్రామాల్లోనే సేవలు పొందేలా గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను నెలకొల్పింది. పేదలకు మంచి చేయాలనే దృక్పథంతో పరిపాలన చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలను కొందరు రెవెన్యూ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది నీరుగారుస్తున్నారు.

ప్రాథమిక విచారణ నుంచే అసలు కథ

తొలుత వీఆర్వో ప్రాథమికంగా విచారణ చేయాలి. అక్కడ నుంచే నగదు చేతులు మారుతుంటాయి. సంబంధిత సర్వే నంబర్‌లో భూమి ఉందా, అడంగళ్‌లో ఎవరి పేరున ఉంది, కొనుగోలు చేసిన వారి పేరు ఉందా.. అన్న వివరాలు పరిశీలిస్తారు. తర్వాత ఆర్ఐ రంగంలోకి దిగుతారు. ఆయన కూడా దాన్ని పరిశీలించి.. తరువాత డిప్యూటీ తహసీల్దార్, తహసీల్దార్ టేబుల్‌పైకి పంపిస్తారు. చివరగా సంబంధిత ఆర్డీఓ కార్యాలయానికి కౌంటర్ సైన్ కోసం పంపిస్తారు. పట్టాదారు పాస్ పుస్తకాన్ని క్షుణంగా పరిశీలించి ఆర్డీఓ సంతకం కాగానే బయటకు వస్తుంది. ఈ తతంగమంతా జరగడానికి ఒక్కో రైతుకు భూమి విలువ ఆధారంగా లక్షల రూపాయలు ఇచ్చుకోవాల్సి వస్తోంది.

ముడుపుల కోసం చేయిచాచి రెవెన్యూ వ్యవస్థ పేరును పోగొడుతున్నారు. జిల్లాలోని కొన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో చిన్నచిన్న పనులకు కూడా ముడుపులు తీసుకుంటున్నారు. లంచాలివ్వకుంటే కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగినా సమస్యలు పరిష్కరించకపోవడంతో ప్రజలు ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే స్పందన కార్యక్రమానికి పరుగులు పెడుతున్నారు. అక్కడి నుంచి ఛీవాట్లు వస్తున్నా అదరం..బెదరం.. అంటూ తిప్పవేసి రైతుల ముక్కుపిండి లంచాలు గుంజేస్తున్నారు. ఉన్నతాధికారులు నిత్యం తనిఖీలు చేస్తే తప్ప వారిలో బాధ్యత, అవినీతి రూపుమాపదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

పాసుపుస్తకం దరఖాస్తు వచ్చిందంటే పండగే

పట్టాదారు పాస్ పుస్తకం కోసం దరఖాస్తు వచ్చిందంటే రెవెన్యూ కార్యాలయంలో పండగే. కచ్చితంగా ఇంత డబ్బు వస్తుందని అధికారులు ముందుగానే లెక్కలు వేసుకుంటారు. మిగతా పనులన్నింటినీ పక్కన పెట్టి ముడుపుల ఫైల్‌ను పరుగెత్తిస్తారు. దాని వేగం సంబంధిత రైతు ఇచ్చే కరెన్సీ మీద ఆధారపడి ఉంటుంది. రెవెన్యూ సిబ్బంది దృష్టంతా దానిపైనే ఉంటుంది. రైతు ఆశ్చర్యపడే విధంగా పట్టాదారు పాస్ పుస్తకం అతని కళ్ల ముందు సాక్షాత్కరిస్తుంది. కరెన్సీ ఉంటే క్షణాల్లో పనులు జరుగుతాయనేందుకు పట్టాదారు పాస్ పుస్తకాలే నిదర్శనం. ఆ ప్రాంత విలువ ఆధారంగా రేట్‌ను నిర్ణయిస్తుంటారు. ఎంత తక్కువగా చూసినా ఒక్కో పట్టాదారు పాస్ పుస్తకానికి దాదాపు రూ.20 వేల నుంచి రూ.లక్షకు తగ్గకుండా వసూలు చేస్తుంటారు. వీఆర్వో నుంచి దానిపై చివరి సంతకం చేసే అధికారి వరకు జేబులు నింపుకుంటారు.

రుణం పొందాలంటే పాస్ పుస్తకం ఉండాల్సిందే

పంట రుణాలు, సబ్సిడీలు పొందాలంటే పాస్ పుస్తకాలు ఉండాల్సిందే. ఈ క్రమంలో దాదాపు జిల్లాలో 1,100 మంది రైతులు పట్టాదారు పాస్ పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అడంగల్ కాపీలో తప్పులు దొర్లాయంటే అక్కడి రెవెన్యూ అధికారులకు పండగే. కుల, ఆదాయ, ఇతర ధ్రువీకరణ పత్రాల మంజూరు కూడా రూ.500 నుంచి రూ.1000 ఆశిస్తున్నారు. మ్యూటేషన్ ఫైల్స్‌కు పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. తహసీల్దార్ కార్యాలయాల్లో కొంతమంది వీఆర్వోలు నిజాయితీగా పనిచేస్తున్నా.. మరికొంత మంది ముడుపుల స్వీకరణకు కీరోల్‌గా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

ఏసీబీ కేసులు ఇలా..

- 2020 జనవరి 25న అప్పటి ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని రేణిగుంట, వడమాలపేట మండలాల తహసీల్దార్ కార్యాలయాల్లో ఏసీబీ దాడులు నిర్వహించింది. అనధికార సొమ్మును సీజ్ చేసింది. రైతులు టైటిల్ డీడ్, ఈ పాస్‌పుస్తకం కోసం చేసుకున్న దరఖాస్తులను కారణం చూపకుండానే వీఆర్వోలు పెండింగ్‌లో పెడుతున్నట్లు గుర్తించారు.
- 2017 సెప్టెంబర్ 24న పూతలపట్టు తహసీల్దార్ సుధాకరయ్య రెండు లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కాడు.
- 2022 నవంబర్ 16న రూ.5 వేలు ఇస్తానని వెయ్యి రూపాయలే తెస్తావా..? అంటూ ఓ రైతును డిమాండ్ చేసిన అప్పటి తహసీల్దార్ రమణి వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేసింది. దీంతో ఆ తహసీల్దార్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.
- 2020 అక్టోబర్ 9లో వి.కోట తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వో భానుమూర్తి రూ.2 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు.

ప్రజలకు తెలియజేసేది ఏమంటే?



చిత్తూరు, తిరుపతి జిల్లా ప్రజలకు ఏసీబీ తరుపున ముఖ్యంగా తెలియజేసేది ఏమిటంటే ప్రభుత్వ ఉద్యోగులు లంచం డిమాండ్ చేసినా, అక్రమ ఆస్తులు కలిగి ఉన్నా వెంటనే తెలియజేయండి. ఏ ప్రభుత్వ కార్యాలయంలో అయినా లంచం అడిగితే భయపడకుండా తెలపండి. రాష్ట్ర ప్రభుత్వం ఫిర్యాదులు చేసేందుకు మొబైల్ యాప్‌ను ఏర్పాటు చేసింది. ఆడియో, వీడియో రికార్డు చేసి యాప్‌లో నమోదు చేస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం. 14400 నెంబర్‌కు ఫిర్యాదు చేసి మా సహాయం పొందుతారని ఆశిస్తున్నాను.

– దేవప్రసాద్, ఏసీబీ అడిషనల్ ఎస్పీ

పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

- 5న మేరీ లైఫ్- మేరా స్వచ్ఛ షహర్



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని జూన్ 5న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో మేరీ లైఫ్ – మేరా స్వచ్ఛ షహర్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన వాల్ పోస్టర్లను గురువారం ఆవిష్కరించారు. అనంతరం కార్యక్రమ నిర్వహణపై అధికారులతో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణలో భాగంగా నిర్వహించే ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థలు, అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు, పాఠశాలలు, కళాశాలలు, రెస్టారెంట్లు, ఇతర వ్యాపార సంస్థలను ఇందులో భాగస్వామ్యం చేయనున్నట్లు చెప్పారు. స్వచ్ఛ భారత్ మిషన్ చేపట్టిన రెడ్యూస్, రీసైకిల్, రియూజ్ (ఆర్ఆర్ఆర్) ప్రక్రియలో నగర ప్రజల్ని భాగస్వామ్యం చేయనున్నట్లు చెప్పారు. పాత దుస్తులు, వినియోగంలో లేని బొమ్మలు, ప్లాస్టిక్ వస్తువులు, ఇతర రకాల వస్తువులను సేకరించడం దీని ముఖ్య ఉద్దేశమన్నారు. వీటి సేకరణ కోసం కరకంబాడి రోడ్డు, బాలాజీ కాలనీ, అన్నమయ్య సర్కిల్, ఫిష్ మార్కెట్ వెనకాల సచివాలయం, శ్రీనివాసం పక్కన ఇందిరా మైదానం వద్ద పాత వస్తువుల సేకరణ కేంద్రాలు అందుబాటులో ఉంటాయన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వరరెడ్డి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి, వివిధ అసోసియేషన్ల నాయకులు విశ్వం విశ్వనాథరెడ్డి, మంజునాథ్, కేవీ.చౌదరి, వెంకటేశ్వరరావు, విశ్వనాథ్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చెంగాళమ్మతల్లి బ్రహ్మోత్సవాలు

- భక్తుల రద్దీ నేపథ్యంలో భారీ ఏర్పాట్లు
- స్థానికుల సహకారం ఎంతో అవసరం
- ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వెల్లడి



బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిలివేటి, చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి

సూళ్లూరుపేట: పట్టణంలోని శ్రీచెంగాళమ్మ పరమేశ్వరి బ్రహ్మోత్సవాలను జూన్ 8 నుంచి అంగరంగవైభవంగా నిర్వహించనున్నట్టు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. గురువారం ఆలయ ఆవరణలో బ్రహ్మోత్సవాలకు సంబంధించి తమిళం, తెలుగు భాషల్లో ముద్రించిన వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఆలయంలో జరుగుతున్న పనులను పరిశీలించి సిబ్బంది పలు సూచనలు అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలకు తమిళనాడు నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఈ సారి తమిళంలో వాల్ పోస్టర్లు ముద్రించామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి వాటంబేడు రోడ్డులోని సుమారు 25 ఎకరాల్లో బ్రహ్మోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశామని తెలిపారు. జూన్ 8న రాత్రి బలిహరణ కార్యక్రమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 9 సాయంత్రం 4 గంటలకు సుళ్లు ఉత్సవం, రాత్రి అశ్వ వాహనం, 10న సాయంత్రం 4కి సుళ్లు ఉత్సవం, మహిషాసుర మర్దన అనంతరం రాత్రి 10 గంటలకు సింహ వాహన సేవ, 11న సాయంత్రం 4కి సుళ్లు ఉత్సవం, నంది వాహన సేవ, 12న సాయంత్రం 7 గంటలకు కాళంగినదిలో తెప్పోత్సవం, అనంతరం రాత్రి 10కి గ్రామోత్సవం, 13న రాత్రి 9 గంటలకు శయనసేవ, గ్రామోత్సవం, 14న రాత్రి 8 గంటలకు పుష్పపల్లకీ సేవతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో రోజూ సాయంత్రం 7 నుంచి రాత్రి 12 దాకా సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసులురెడ్డి, పాలకమండలి సభ్యులు వంకా దినేష్‌కుమార్, కర్లపూడి సురేష్‌బాబు, ఓలేటి సత్యనారాయణ, బండి సునీత, చంద్రశేఖర్‌రెడ్డి, పట్టణపార్టీ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్‌రెడ్డి, ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, బాలాంజనేయస్వామి ఆలయ చైర్మన్ అయితా శ్రీధర్, పార్టీ నాయకులు జెట్టి వేణుయాదవ్, ఈశ్వరవాక శ్రీనివాసులురెడ్డి, మీజూరు రామకృష్ణారెడ్డి, పర్వతరెడ్డి రవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి ఎడ్యుకేషన్ : భారత ప్రభుత్వ సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలో నడుస్తున్న సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజినీరింగ్–టెక్నాలజీ (సీపెట్‌ఈటీ) విద్యాసంస్థలో వివిధ డిప్లొమో, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమో కోర్సుల్లో 2023–24లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. ఆ మేరకు సీపెట్‌ఈటీ సంస్థ టెక్నికల్ ఆఫీసర్ కేకే.రావు ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల కాలవ్యవధి ఉన్న డిప్లొమో ఇన్ ప్లాస్టిక్స్ టెక్నాలజీ(డీపీటీ), డిప్లొమో ఇన్ ప్లాస్టిక్స్ మౌల్డ్ టెక్నాలజీ(డీపీఎంటీ) కోర్సులకు 10వ తరగతి పాసైన, చదువుతున్న విద్యార్థులు, రెండేళ్ల కాలవ్యవధి ఉన్న పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమో ఇన్ ప్లాస్టిక్స్ ప్రాసెస్సింగ్ అండ్ టెస్టింగ్ (పీజీడీ–పీపీటీ) కోర్సుకు బీఎస్సీ పాస్/ఫైనలియర్ విద్యార్థులు అర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250, ఓబీసీ, జనరల్ విద్యార్థులు రూ.500ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి ఈ నెల 28వ తేదీలోపు 'డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. సీపెట్‌ఈటీ. జీఓవీ.ఇన్' వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న వారికి జూన్ 11వ తేదీన విజయవాడ, అనంతపురం కేంద్రాల్లో సీపెట్‌ఈటీ అడ్మిషన్ టెస్ట్–2023ను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ టెస్టులో క్వాలిఫై అయిన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ జ్ఞానభూమి వైబ్‌సైట్ ద్వారా నిబంధనలను అనుసరించి ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం కల్పిస్తామని, అలాగే విద్యార్థిని, విద్యార్థులుకు విడివిడిగా హాస్టల్ సదుపాయం కల్పిస్తామని తెలిపారు. కోర్సులు, ఇతర సమాచారానికి 88979 95858, 79896 60290 నంబర్లలో ఏటి.రాజును సంప్రదించాలని ఆయన కోరారు.

జిల్లా ఓటర్లు 17,27,576 మంది



మాట్లాడుతున్న కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: ఎన్నికల కమిషన్ ఆదేశాలు పాటించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సిబ్బందికి సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఆయన గురువారం కలెక్టరేట్ నుంచి జిల్లా అధికారులకు తెలియజేశారు. జూన్‌లో కొత్త ఈవీఎంలు రానున్నాయని తెలిపారు. గత జనవరిలో తుది ఓటర్ల జాబితా ప్రచురించారని, నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలను చదివి వినిపించారు. జిల్లాలో మొత్తం 17,27,576 ఓటర్లు ఉన్నారని వివరించారు. తుది ఓటర్ల జాబితా అనంతరం చేర్పులు, తొలగింపులు చేపట్టి త్రైమాసిక ఓటర్ల జాబితా సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే తెలపండి

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలోని ఎంఈవోలకు పంపిన ఎస్జీటీ సీనియారిటీ జాబితాలో ఏవైనా అభ్యంతరాలున్నట్‌లైతే పరిశీలించి తెలపాలని డీఈవో విజయేంద్రరావు వెల్లడించారు. ఈ మేరకు ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న 66 మండలాల్లో పనిచేస్తున్న ఎస్జీటీలకు స్కూల్ అసిస్టెంట్లుగా శాశ్వత ఉద్యోగోన్నతులు ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. ఈ మేరకు తాజాగా రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జారీచేసిన ఉత్తర్వులను అనుసరించి కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జనవరి 12న జిల్లాలో పనిచేస్తున్న ఎస్జీటీలకు తాత్కాలిక ఉద్యోగోన్నతులు ఇచ్చామన్నారు. ప్రస్తుతం ఆ తాత్కాలిక ఉద్యోగోన్నతులను రద్దు చేసినట్లు వివరించారు. సంబంధిత సీనియారిటీ ఎస్జీటీల జాబితాను ఎంఈవోలకు పంపామని, వాటిని పరిశీలించుకుని ఏవైనా అభ్యంతరాలున్నట్‌లైతే ఈ నెల 19వ తేదీ లోపు తగిన ఆధారాలతో చిత్తూరు డీఈవో కార్యాలయంలో తెలియజేయాలన్నారు. గడువు తేదీ తర్వాత ఏవైనా అభ్యంతరాలొస్తే స్వీకరించేది లేదని డీఈవో తెలిపారు.

రిజర్వాయర్లను అడ్డుకునేందుకే ఆరోపణలు

- నీతినిజాయితీకి మారుపేరు పెద్దిరెడ్డి కుటుంబం
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పెద్దిరెడ్డి, పక్కన నాగభూషణం, అలీమ్‌బాషా

పుంగనూరు: పడమటి మండలాలకు సాగునీరు–తాగునీరు అందించేందుకు నిర్మిస్తున్న రిజర్వాయర్లను అడ్డుకునేందుకే అసత్య ఆరోపణలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన గురువారం మున్సిపాలిటీలో విలేకరులతో మాట్లాడారు. నీతి నిజాయితీకి మారుపేరు పెద్దిరెడ్డి కుటుంబమని, ఆయనపై ఆరోపణలు చేయడం తగదని హితవు పలికారు. నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి తన అన్న కిరణ్‌కుమార్ రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో సీఐ పార్థసారథితో కలసి స్మగ్లింగ్ చేసి కోట్లాది రూపాయలు సంపాదించారని ఆరోపించారు. నేతిగుట్లపల్లె, ఆవులపల్లె వద్ద నిర్మిస్తున్న రిజర్వాయర్లపై ఆరోపణలు చేసి, వాటిని అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశీసులతో మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తాగు–సాగునీటి ప్రాజెక్టులు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. ప్రాజెక్టుల వద్ద రైతులకు తగిన పరిహారం అందజేస్తున్నామన్నారు. ప్రాజెక్టులపై ఆరోపణలు చేస్తే ప్రజలు గ్రామాల్లో తిరగనివ్వకుండా అడ్డుకోవడం ఖాయమని చెప్పారు. ఇద్దరు సీఎంలు పుంగనూరు అభివృద్ధిని అడ్డుకున్న విషయం ప్రజలు గమనిస్తున్నారని, ఈ సారి తరిమికొడతారని తెలిపారు. జానపద కళల సంస్థ చైర్మన్ కొండవీటి నాగభూషణం మాట్లాడుతూ పెద్దిరెడ్డి కుటుంబాన్ని విమర్శించే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. పీకేఎం ఉడా చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్ మాట్లాడుతూ నల్లారి కిషోర్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ అమరనాథరెడ్డి, వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, నాయకులు రామ్మూర్తి, అంజిబాబు, చంద్రారెడ్డి యాదవ్, చెంగారెడ్డి, కళ్యాణ్, వరుణ్, కాళిదాసు తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో భూదందా



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

దక్కిలి: టీడీపీ హయంలో అమరావతిని భ్రమరావతిగా చూపించి పెద్దలు, ధనికులు కలిసి భూదందా దాకు తెరలేపారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజవకర్గ సమన్వయ కర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. మండలంలోని నాగవోలు సచివాలయ పరిధిలో చాపలపల్లి గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పేదలకు అమరావతి ప్రాంతంలో ఇంటి స్థలాలు ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రయత్నిస్తే ప్రతిపక్ష నాయకులు హైకోర్టు, సుప్రీంకోర్టులను ఆశ్రయించారని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని పదవుల్లో 50 శాతం బడుగు బలహీన వర్గాలకు అవకాశం కల్పిస్తున్నారని చెప్పారు. జెడ్పీటీసీ సభ్యరాలు కలిమిలి రాజేశ్వరి, ఎంపీపీ గోను రాజశేఖర్ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు





ఆలయం ఎదుట కర్ణాటక హైకోర్టు జస్టిస్ ఎస్‌జీ పండిట్, ఎంపీ శ్రీధర్

తిరుమల: శ్రీవారిని గురువారం కర్ణాటక హైకోర్టు జస్టిస్ ఎస్‌జీ పండిట్, ఎంపీ శ్రీధర్, మాజీ మంత్రి సిద్దరాఘవులు దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

31 వరకు జేసీ సెలవు

తిరుపతి అర్బన్: జిల్లా జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ వ్యక్తిగత కారణాలతో గురువారం నుంచి ఈనెల 31వ తేదీ వరకు సెలవుపై వెళ్లారు. ఈ క్రమంలో డీఆర్వోగా పనిచేస్తున్న ఎం.శ్రీనివాసరావుకు జాయింట్ కలెక్టర్ బాధ్యతలను కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి అప్పగించారు.

మిస్టరీ వీడేదెప్పుడు?

- శానంబట్లలో ఆగని మంటలు
- తాజాగా రెండు ఇళ్లల్లో అకస్మాత్తుగా రేగిన మంటలు
- ఆర్డీఓ, తహసీల్దార్లు పర్యటిస్తున్న సమయంలోనే...
- ఆందోళనలో గ్రామస్తులు



కొత్తశానంబట్ల గ్రామస్తులతో మాట్లాడుతున్న తిరుపతి ఆర్డీఓ కనక నరసారెడ్డి

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలం, కొత్తశానంబట్ల వాసులకు నెలరోజులుగా కంటి మీద కునుకులేకుండా చేస్తున్న ఆకస్మిక మంటల మిస్టరీ ఇంకా కొనసాగుతూనే ఉంది. తాజాగా గురువారం రెండు ఇళ్లల్లో బెడ్‌పైన, బట్టల మూటలో మంటలు రేగాయి. అధికారులు, పోలీసులు పర్యటిస్తున్న సమయంలోనే ఈ ఘటన సంభవించడంతో గ్రామస్తులు మరింత భయాందోళనలకు గురవుతున్నారు. సమస్య మూలాలను గుర్తించకుండా శాస్త్రీయ పద్ధతుల్లో ఛేదిస్తామంటూ అధికారులు ఆలస్యం చేస్తుండడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉదయం, సాయంత్రం మంటలు

గురువారం ఉదయం రవిరెడ్డి ఇంట్లో బట్టల మూటలో నుంచి అకస్మాత్తుగా మంటలు రేగాయి. పర్యవేక్షిస్తున్న పోలీసులు గుర్తించి రవిరెడ్డి భార్య రాణెమ్మను అప్రమత్తం చేశారు. అప్పటికే బట్టలు చాలా వరకు కాలిపోయాయి. సాయంత్రం అందరూ బయట ఉండగానే ప్రసాద్‌రెడ్డి ఇంట్లో బెడ్‌పైన మంటలు చెలరేగాయి. ఇంట్లో నుంచి మంటలు రావడాన్ని గుర్తించిన స్థానికులు పోలీసుల సాయంతో ఆర్పివేశారు. బుధవారం మధ్యాహ్నం కూడా మునిరత్నంరెడ్డి ఇంట్లో బట్టల నుంచి మంటలు చెలరేగాయి. ఈ ఘటనలతో గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు.

పర్యటించిన అధికారులు

మిస్టరీ మంటల మూలాలపై పరిశీలన చేసేందుకు గురువారం సాయంత్రం తిరుపతి ఆర్డీవో కనకనరసారెడ్డి, తిరుపతి జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ గిరిధర్, చంద్రగిరి, రామచంద్రాపురం తహసీల్దార్లు శిరీషా, చిన్న వెంకటేశ్వర్లు గ్రామంలో పర్యటించారు. బాధితుల ఇళ్ల వద్దకు వెళ్లి సంఘటనలపై ఆరా తీశారు. వారు పర్యటిస్తున్న సమయంలోనే ప్రసాద్‌రెడ్డి ఇంట్లో బెడ్‌కు మంటలు అంటుకోవడంతో వెంటనే అక్కడికి వెళ్లారు.

నిపుణులు, జనవిజ్ఞానవేదిక సహకారంతో...

గ్రామంలో సంభవిస్తున్న మంటల మూలాలను త్వరలోనే గుర్తిస్తామని తిరుపతి ఆర్డీఓ కనక నరసారెడ్డి తెలిపారు. ఇప్పటికే ఫోరెన్సిక్ ల్యాబ్‌కు కొన్ని వస్తువులను పంపించామన్నారు. ఇంకా క్షుణ్ణంగా పరిశీలించేందుకు యూనివర్సిటీల నుంచి నిపుణులు, గ్రామస్తుల్లో భయాన్ని తొలగించేందుకు జన విజ్ఞానవేదిక ప్రతినిధులను గ్రామానికి తీసుకువస్తామన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.78 లక్షలు పైనే



హుండీ కానుకల లెక్కింపులో అధికారులు

రాపూరు: పెంచలకోనలోని పెనుశిల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం హుండీలకు భక్తులు భారీగా కానుకలు సమర్పించినట్టు ఈఓ జనార్దన్‌రెడ్డి తెలిపారు. శ్రీవారి నిత్యకల్యాణ మండపంలో గురువారం హుండీ కానుకలను లెక్కించారు. 52 రోజులకు గాను లెక్కించిన కానుకల్లో హుండీల ద్వారా 78 లక్షల, 81 వేల, 572 రూపాయల నగదు, బంగారం 421 గ్రాములు, వెండి 4 కేజీల 50 గ్రాములు వచ్చినట్లు వెల్లడించారు. తాత్కాలిక హుండీల ద్వారా 24 లక్షల, 26 వేల, 782, బంగారం 492 గ్రాములు, వెండి 6 కేజీల 95 గ్రాములు వచ్చినట్టు పేర్కొన్నారు. అలాగే విదేశీ కరెన్సీ కూడా వచ్చిందన్నారు. జిల్లా దేవదాయశాఖ అధికారి శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

టాపర్లకు జగనన్న బొనాంజ

తిరుపతి అర్బన్: పదో తరగతి, ఇంటర్‌లో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదివి ఉత్తమ మార్కులు సాధించిన వారికి జగనన్న ఆణిముత్యాల పేరుతో ఆత్మీయంగా సత్కరించనున్నట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన గురువారం విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పదో తరగతిలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.50 వేలు, ద్వితీయ స్థానం సాధించిన వారికి రూ.30వేలు, తృతీయ స్థానం పొందిన వారికి రూ.10 వేలు నగదు బహుమతి ఉంటుందన్నారు. అదేవిధంగా ప్రభుత్వ కళాశాలలో ఇంటర్ చదివిన విద్యార్థులకు నగదు బహుమతులు ఉంటాయని వెల్లడించారు. ఈనెల 25న నియోజకవర్గ స్థాయిలో, 27న జిల్లా స్థాయిలో, 31న రాష్ట్ర స్థాయిలో విద్యార్థులతోపాటు యాజమాన్యాన్ని సన్మానించనున్నట్టు తెలిపారు. జిల్లా ఇంటర్మీడియెట్ అధికారి విశ్వనాథ్ నాయక్, డిప్యూటీ డీఈఓ రఘురామయ్య పాల్గొన్నారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం

దక్కిలి: మండలంలోని అంబేడ్కర్‌నగర్ సమీపంలోని వెలుగొండలు అడవుల్లో గురువారం గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. పోలీసులు కథనం మేరకు.. వెలుగొండ అటవీ ప్రాంతంలో ఓ మహిళ మృతి చెంది ఉన్నట్లు పశువుల కాపర్లు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. గురువారం డక్కిలి పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గుర్తించారు. మృతి చెందిన మహిళకు 35 ఏళ్లు ఉంటాయని తెలిపారు. శవ పరీక్షల నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.



బంగారం :	
24 క్యారెట్లు 10 గ్రాములు	రూ.62,390
22 క్యారెట్లు ఒక గ్రాము	రూ.5,603
వెండి:	
హోల్‌సేల్ ధర (కిలో)	రూ.73,600
రిటైల్ వెండి గ్రాము	రూ.75.60

మృతుల కుటుంబ సభ్యులకు నగదు సహాయం



చెక్కులు అందజేస్తున్న ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి

తిరుపతి క్రైమ్: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఐదుగురు హోంగార్డు కుటుంబ సభ్యులకు ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా గురువారం నగదు సహాయాన్ని అందజేశారు. విధి నిర్వహణలో పి. మంజుల, సత్యం, విజయ్‌కుమార్, గోవిందరెడ్డి, మురుగేషన్ మృతి చెందారు. వీరి కుటుంబ సభ్యులకు ఒక్కొక్కరికీ రూ.5 లక్షల చొప్పున అందజేసినట్టు ఎస్పీ తెలిపారు. వీరికి అన్నివేళలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ వెంకటరావు, డీఎస్పీ లక్ష్మణ్‌కుమార్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

హనుమంతుడు కార్యశూరుడు

- విద్యాశంకర భారతి స్వామి
- ముగిసిన హనుమజ్జయంతి ఉత్సవాలు



ఉత్సవాల్లో మాట్లాడుతున్న విద్యాశంకర భారతిస్వామి

తిరుమల: రామకార్యం కోసం ఎన్ని అడ్డంకులు ఎదురైనా దాటుకుని, రాక్షస సంహారం చేసి లంకలో సీతమ్మ జాడ కనిపెట్టిన హనుమంతుడు కార్యశూరుడు అని హైదరాబాద్‌లోని పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతి స్వామి తెలిపారు. తిరుమలలో ఐదు రోజుల పాటు జరిగిన హనుమజ్జయంతి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరి రోజు నాదనీరాజనం వేదికపై స్వామీజీ అనుగ్రహ భాషణం చేశారు. హనుమంతుడు గొప్ప సుగుణాలు గలవాడని, ఆయన ముఖం ఎల్లప్పుడూ ప్రకాశిస్తూ ఉంటుందని చెప్పారు. తల్లి అంజనాదేవి పేరుని తన పేరుగా పెట్టుకుని ఆంజనేయుడు అయ్యాడన్నారు. హనుమంతుడి బలపరాక్రమాలపైన రాముడికి ఎంతో నమ్మకం ఉందని, రాముడు ఆదేశించగానే లక్ష్య సాధన కోసం బయలుదేరారని వివరించారు. హనుమంతుని దృక్కోణంలో చూస్తే రామాయణం మొత్తం నేటి సమాజానికి అర్థమవుతుందన్నారు. రాముడిని ఎక్కడ కీర్తిస్తే అక్కడ హనుమంతుడు ప్రత్యక్షమవుతారని, వీరిది విడదీయరాని అనుబంధమని చెప్పారు. అంతకుముందు ధర్మగిరి వేద వి/జ్ఞాన పీఠం పండితులు పీవీఎస్ఎస్.మారుతి హనుమంతుడు సాధించిన విజయాలు అనే అంశంపై ఉపన్యసించారు. అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు ఆకెళ్ల విభీషణ శర్మ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత కార్యక్రమాలు

ఆకాశగంగలోని శ్రీ బాలాంజనేయస్వామివారి ఆలయం వద్ద హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో కళాకారులు భజనలు చేశారు. తర్వాత దాస సాహిత్య ప్రాజెక్టు కళాకారులు హనుమ సంకీర్తనల గానం, భజన కార్యక్రమం జరిగింది. జాపాలి శ్రీఆంజనేయస్వామివారి ఆలయం వద్ద అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారులు ఉదయభాస్కర్ బృందం హనుమాన్ చాలీసా పఠించారు. ఎస్వీ సంగీత, నృత్య కళాశాల ఆధ్వర్యంలో నృత్య కార్యక్రమం నిర్వహించారు. అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో హరికథా పారాయణం జరిగింది.

జూనియర్ సివిల్‌జడ్జిలకు అనుమతులు

తిరుపతి లీగల్ : జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులకు రాష్ట్ర హైకోర్టు వేసవి సెలవులు ప్రకటించడంతో ఈనెల 22వ తేదీ నుంచి జూన్ 12వ తేదీ వరకు జూనియర్ సివిల్‌జడ్జిలు 11 రోజుల పాటు సెలవులపై వెళ్లడానికి ఉమ్మడి చిత్తూరు జిల్లా జడ్జి భీమారావు అనుమతిలిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. ఈనెల 22 నుంచి జూన్ 1వ తేదీ వరకు కొద్దిమంది జూనియర్ సివిల్‌జడ్జిలకు, జూన్ 2 నుంచి 12వ తేదీ వరకు మరికొంత మంది జూనియర్ సివిల్‌జడ్జిలకు సెలవుపై వెళ్లడానికి అనుమతులిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈనెల 22 నుంచి సెలవుపై వెళుతున్న వారిలో చిత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి బి.ఉమాదేవి, చిత్తూరు మొదటి అదనపు జూనియర్ సివిల్‌జడ్జి ఎం.మాధవి, చిత్తూరు 3వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి శ్రీనివాస్, పలమనేరు జూనియర్ సివిల్‌జడ్జి కె.రవి, కుప్పం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి షేక్ అరీఫా, మదనపల్లి 2వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి ఐ.ప్రవీణ్‌కుమార్, పీలేరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.జ్యోతి, తిరుపతి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.సంధ్యారాణి, తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి గ్రంధి శ్రీనివాస్, పుత్తూరు అదనపు జూనియర్ సివిల్‌జడ్జి వీ.గోపాలకృష్ణ ఉన్నారు. ఆయా కోర్టులకు చిత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి, మొదటి అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులకు చిత్తూరు ప్రత్యేక మొబైల్ మెజిస్ట్రేట్ కీర్తన, చిత్తూరు 3వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు చిత్తూరు 4వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి షేక్ బాబాజాన్, పలమనేరు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు పుంగనూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి జి.కార్తీక్, కుప్పం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు కుప్పం అదనపు జూనియర్ సివిల్‌జడ్జి ఎం.ఎస్ భారతి, మదనపల్లి 2వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు మదనపల్లి మొదటి అదనపు జూనియర్ సివిల్‌జడ్జి షేక్ ఆసీఫా సుల్తానా, పీలేరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు పీలేరు అదనపు జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.గాయత్రి, తిరుపతి 3వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి బి.వాణిశ్రీ, తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు తిరుపతి ఎర్రచందనం కేసుల విచారణ జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.శ్రీకాంత్, పుత్తూరు అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు పుత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి సి.జానికి ఇన్‌చార్జ్ జడ్జిలుగా వ్యవహరించాలని జిల్లా జడ్జి ఉత్తర్వుల్లో తెలిపారు. అలాగే జూన్ 2 నుంచి 12వ తేదీ వరకు సెలవుపై వెళ్లనున్న జడ్జిలలో చిత్తూరు 4వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి షేక్ బాబాజాన్, పుంగనూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి జి.కార్తీక్, చిత్తూరు ప్రత్యేక మొబైల్ కోర్టుకు జడ్జి ఎ.కీర్తన, పుంగనూరు అదనపు జూనియర్ సివిల్‌జడ్జి జి.సింధు, కుప్పం అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎం.ఎస్ భారతి, మదనపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి ఎ.మంజులత, తంబళ్లపల్లి జూనియర్ సివిల్ జడ్జి ఉమర్ ఫరూఖ్, పీలేరు అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.గాయత్రి, తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి బి.వాణిశ్రీ, తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కే.వీ సత్యకాంత్‌కుమార్, తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి పి.కోటేశ్వరరావు, తిరుపతి 5వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి వై.సరిత, తిరుపతి ఎర్రచందనం కేసుల విచారణ జూనియర్ సివిల్‌జడ్జి ఎస్.శ్రీకాంత్, పుత్తూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి సి.జానకి, శ్రీకాళహస్తి అదనపు జూనియర్ సివిల్‌జడ్జి జె.కృష్ణప్రియ ఉన్నారు. ఆయా కోర్టులకు పుంగనూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, పుంగనూరు అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులకు పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి కె.రవి, కుప్పం అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు కుప్పం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, మదనపల్లి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు మదనపల్లి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, తంబళ్లపల్లి జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు మదనపల్లి 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, పీలేరు అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు పీలేరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.జ్యోతి, తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు తిరుపతి 4వ అనదపు జూనియర్ సివిల్ జడ్జి, తిరుపతి మొదటి అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు తిరుపతి 3వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి, తిరుపతి 2వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు తిరుపతి 4వ అనదపు జూనియర్ సివిల్‌జడ్జి, తిరుపతి 5వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు తిరుపతి 3వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి, తిరుపతి ఎర్రచందనం కేసుల విచారణ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు తిరుపతి 4వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి, పుత్తూరు

ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు పుత్తూరు అదనపు జూనియర్ సివిల్‌జడ్జి, శ్రీకాళహస్తి అదనపు జూనియర్ సివిల్‌జడ్జి కోర్టుకు తిరుపతి 3వ అదనపు జూనియర్ సివిల్‌జడ్జిలు ఇన్‌చార్జ్‌లుగా వ్యవహరించాలని జిల్లా జడ్జి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.